# భగవానుడు రక్షించాడు

-వై రుక్మిణీదేవి

ఆ మర్నాటి ఉదయం ఆరింటికల్లా గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో దిగి పదింటికల్లా శిరీషను బస్సులో అమలాపురం తీసుకెళ్తానన్న వియ్యపురాలు వసంతమ్మ ఫోన్ విని శాంతమ్మ ''రేపేనా వదినా! చలిమిడీ అదీ ఏర్పాటు చేయవలసి వుందిగదా. మీరు వచ్చి ఇక్కడ మూడ్రోజులుండి...'' అంటూండగానే ఫోన్లో చర్రున లేచింది వసంతమ్మ.

''నీకూతురేం పిల్లనీ, పిడకనీ ఎత్తుకొస్తోందా అన్ని ఆర్భాటాలతో వైభవంగా పంపటానికి? తొలిచూలు ఇలా మట్టిపాలవటం అటు ఏడు తరాలూ, ఇటు ఏడు తరాలూ మాయింటా వంటా లేదు. హు .. ఈ ప్రబుద్ధుడి పోరు పడలేక చస్తున్నాగానీ నాకసలు దానిమొహమే చూడాలన్పించటంలేదు. వెధవ సంత.. వెధవ సంతని.'' అని ఈసడించి పారేసింది.

ఆ మాటలు కొడుకు కిరీటికి చెప్పుకుని కన్నీరు మున్నీరుగా ఏడ్చింది శాంతమ్మ శిరీష కళ్ళబడకుండా.

అమ్మ వేదన చూస్తూంటే కిరీటి మనసు విలవిలలాడిపోయింది. ''జరిగిన అనర్థంలో చెల్లాయి తప్పేముంది? సిరినలా దోషిగా చేసి మాట్లాడుతుందేమిటి వాళ్ళత్తగారు?'' అన్నాడు కిరీటి ఆవేదనగా.

''అది మన ప్రారబ్దం నాన్నా. పసిపిల్ల కోసం వెయ్యి కళ్ళతో, కోటి ఆశలతో ఎదురుచూస్తూన్న కుటుంబం వాళ్ళది. అనుకోకుండా పెద్దకోడలి తొలిచూలు ఇలా గంగపాలైతే ఎవరి మనసైనా బాధపడుతుందిగా.'' చెంగుతో కళ్ళనీళ్ళు ఒత్తుకుంటూ అన్నది శాంతమ్మ.

''ఆ డబ్బు పిశాచి డాక్టర్ సమీర వల్లేనమ్మా ఇలా జరిగింది. దాని దురాశ, నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగింది. ఇంకా పదిరోజులు గడువుంది కదాని పైకం విషయంలో అశ్రద్ధగా వుండిపోవటం నేను చేసిన పెద్ద పొరపాటు. ఆ నర్సింగ్‌హోం నుంచి గవర్నమెంట్ హాస్పిటల్‌కెళ్ళే ఆ గంట టైములోనే చెల్లి కడుపులో పాప చనిపోయింది. ప్చ్.. ఆ పిశాచి మొహం పచ్చడి చేసి, మెడలు విరిచి పారేయాలన్నంత కోపం ముంచుకొస్తోంది నాకు'' పిడికిలి బిగించి కసిగా అన్నాడు.

''దేనికైనా ప్రాప్తం వుండాలినాన్నా. మన రాతే బాగుంటే అనుకున్నదానికి పదిరోజులు ముందే తగులుకునేవే కావు'' శాంతమ్మ నుదురు కొట్టుకుంది.

''ఆ డాక్టర్ పిశాచి కాస్త మనసుపెట్టుకు సహాయం చేసివుంటే సిరి చేతిలో పండంటి పాపాయి ఆడుకుంటూ వుండేదిగా అమ్మా. సమయానికి ఆపరేషన్ చేయకనే అలా జరిగింది.''

''విధినెవరూ తప్పించలేరయ్యా. కడుపుపంట పంటకల్లం లాంటిది. మళ్ళీ ఏడాదికి పిల్ల కడుపు పండి పరమాత్మ కరుణించి ఒక నలుసు పుడితే అంతే చాలు.'' దేవుడికి చేతులు జోడించింది కాంతమ్మ.

''ఈలోగా ఆ అత్తగారు మాటల ఈటెలతో సిరిని పొడిచి పొడిచీ చంపదా అమ్మా.'' బాధతో కిరీటి గొంతు గద్గదికమైంది.

''కొన్నిరోజులలా వుంటాయి. భరించక తప్పదయ్యామరి. సరే, నేను బియ్యం పోస్తాగానీ నువ్వు రెండు కేజీల పంచదారా, వందగ్రాముల జీడిపప్పు, నాలుగు ఎండు కొబ్బరిచిప్పలూ, యాభై గ్రాముల యాలకులు పట్రానాన్నా. రాత్రి పొద్దుపోయాక చలిమిడి చేస్తే ఒక్క రోజన్నా నిద్రచేసినట్లుంటుంది'' అంటూ లేచింది కాంతమ్మ.

''సిరి ఎక్కడమ్మా. కన్పించదేం?'' అని అడిగాడు కిరీటి.

''ఇందాక వత్సల వచ్చింది. దాని ఏడుపుచూసి నీరైపోయి సిరిని అలా గుడిదాకా తీస్కెళతానంది. కాస్త బయట తిరిగితేనన్నా దుఃఖం మరిచిపోతుందని బలవంతాన గుడికి పంపాను'' లోపలికెళ్తూ చెప్పింది శాంతమ్మ.

''ఇంత ఏడ్పూ ఆ డాక్టర్‌ని ఏడ్పించగలిగితే?'' పళ్ళు పటపటా కొరుక్కున్నాడు కిరీటి.

ఇంతలో ''అన్నయ్యా, నీకు మళ్ళీ ఫోనొచ్చింది'' అంటూ పక్కింటి పాప భువన వచ్చింది.

గబగబా పక్కింటివేపు వెళ్ళి ఫోనందుకున్నాడు కిరీటి.

''హలో కిరీటీ!'' అటువైపు నుంచి బాస్ భుజంగరావు పిలుపు.

''సార్! నేనే. చెప్పండి'' అన్నాడు వినయంగా.

''ఈవేళ మనకు సీవ్యూ ప్రోగ్రాం వుంది. నువ్వు అయిదు గంటలకల్లా కోనేటి సెంటర్లో మన ఎలక్ట్రికల్స్ షాపు దగ్గరుండు. నేనక్కడికి వస్తాను. అట్నించి సీవ్యూకెళ్ళిపోదాం'' ఉల్లాసంగా అన్నాడు భుజంగరావు.

'సీవ్యూ ప్రోగ్రాం ఈయనగారు ఇవేళే పెట్టుకోవాలా? రేప్పొద్దుటి వరకూ తనిక ఆ సముద్రం ఒడ్డునే కార్లో పడుండి.. ఆయన విడిచిన చిలుకని దాని అడ్రసుకు చేర్చి.. మరి.. ఆరుగంటలకు సిరి అత్తగార్నెలా రిసీవ్ చేసుకోవటం?' నుదురు ముడిపడగా కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాడు కిరీటి.

''ఏం కిరీటీ? మాట్లాడవేం?'' ధాటీగా ధ్వనించింది భుజంగరావు గొంతు.

''ఏంలేద్సార్. మన ఎలక్ట్రికల్స్ షాపు దగ్గరుండమంటారా నన్ను?'' సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతూ అతి వినయంగా అన్నాడు.

''మమ్మల్నక్కడ దింపి నువ్వు వచ్చేయటమే. తిరుగు ప్రయాణం సంగతి నేనే చూస్కుంటా.''

'ఇదో కొత్త ఏర్పాటులా వుందే!' మనసులో అనుకుంటూ ''ఉదయం వరకూ వుంటాలెండిసార్'' అన్నాడు విధేయతగా.

''అక్కర్లేదు. నీకీసారి హాఫ్ డ్యూటీయేనోయ్.'' విలాసంగా అన్నాడు భుజంగరావు.

'నా బొంద డ్యూటీ! డెబ్బైలో పడినా బులపాటం మాత్రం తగ్గలేదు' కిరీటి మనసు విసుగ్గా గొణుగుతూంటే, నోరు ''అలాగే సార్! నేనిప్పుడే బయల్దేరి మనషాపు దగ్గరకు వెళ్తున్నాను'' అన్నాడు.

''సరే.'' ఫోన్ పెట్టేశాడు భుజంగరావు.

ఫోన్ చెవిదగ్గర నుంచి తీసి చూస్తూ 'ఇదో డబ్బు బాగోతం. ఆ డిగ్రీ అయిపోగానే ఈ జంజాటం వదిలించుకుని ఎక్కడో ఒకచోట చిన్న వుద్యోగం చూసుకోవాలి' విసుగ్గా అనుకున్నాడు తనలో తను.

ఫోన్ పక్కనే కూర్చుని 'ముకుందమాల' చదువుతూన్న మామ్మగారికి ''థాంక్స్'' చెప్పి ఇవతలికొచ్చి శాంతమ్మ చెప్పిన సరుకులు తేవటానికి కొట్టుకెళ్ళాడు కిరీటి. కొట్టతను సరుకులు కడ్తూంటే బల్లమీద కూర్చున్న కిరీటిని అతని భార్య ''ఏం బాబూ! చెల్లిని అత్తింటికి పంపుతున్నారా? చలిమిడి సరుకులు కట్టిస్తున్నట్లున్నావ్?'' అని అడిగింది చనువుగా.

''అవునండీ.'' అన్నాడు కిరీటి.

''హు ఏవి టో.. తొమ్మిది నెలలూ మోసి చివరికి ఫలితం దక్కకుండా పోయింది బిడ్డకి. సెనగలు తిని చెయ్యి గడిగేసినట్లయింది'' భారంగా నిట్టూర్చి

అన్నది. ఆమె మాటలు విన్న కిరీటి కళ్ళు చెమర్చాయి.

ఇబ్బందిగా కదిలి మౌనంగా వూరుకున్నాడు.

''ఆవేళ.. ఆస్పత్రిలో చూశానయ్యా.. పండంటి మగబిడ్డ! ఈ డాక్టరమ్మ మరీ ఇంత కరుకుదని తెలీదు నాకు. లేదంటే ఏకంగా అమ్మకి పెద్దాస్పత్రికే పోదామని చెప్పుండేదాన్ని. మాతల్లి? రేపింకా బిడ్డా, పాప కని పెంచాల్సి వుంది. కాసంత కనికారం చూపలేకపోయింది.''

''దానివల్లే నమ్మా ఇదంతా జరిగింది?'' ఆవేశంగా అనబోయి అంతలో తమాయించుకున్నాడు కిరీటి ఆమె ముందు తను బైటపడటం బావుండదని.

''ఏమోలే. దేవుడు చల్లగా చూస్తే మళ్ళీఏడాది ఈపాటికి సిరి తల్లిఒడి నిండకపోతుందా?'' చాక్లెట్లు కొనుక్కోవటానికొచ్చిన పిల్లాడి దగ్గర డబ్బులు తీసుకుని నాలుగు చాక్లెట్లిస్తూ అన్నది.

ఈలోపుగా సరుకులు కట్టటం పూర్తయింది.

కిరీటి కొట్టతనికి డబ్బులిచ్చేసి పాకెట్లు పట్టుకుని కొట్లోంచి బైటకొచ్చేశాడు.

• • •

ఎలక్ట్రికల్స్ షాపు ముందు క్రీమ్‌కలర్ ఇండికా ఆగగానే షాపులోంచి చప్పున బైటకొచ్చి ఫ్రంట్ డోర్ దగ్గర నిలబడ్డాడు కిరీటి.

ఆ ఎ.సి. కారు డోర్‌కున్న నల్లటి అద్దం నెమ్మదిగా కిందకు దిగింది. డ్రైవింగ్ సీటులోవున్న భుజంగరావు 'డోరు తెరువు' అన్నాడు. డోర్ తెరిచి పట్టుకున్నాడు కిరీటి. భుజంగరావు కిందకు దిగాడు.

''షాపులోకెళ్ళి ఇప్పుడే వస్తాను'' అని షాప్‌లోకెళ్ళాడు భుజంగరావు.


ఆయన బైటకు వచ్చేవరకూ డోర్ మూసేసి అక్కడే కాచుక్కూర్చున్నాడు కిరీటి. భుజంగరావు అయిదు నిముషాల్లో బైటకొచ్చి బాక్‌డోర్ వేపు నడుస్తూండగా చప్పున వెళ్ళి బాక్‌డోర్ తెరిచి పట్టుకున్నాడు కిరీటి.

ఆయన కారెక్కాక డోర్ మూసేసి తను వచ్చి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు కిరీటి. మరు నిముషంలో మంగినపూడి వేపు దూసుకుపోయింది క్రీమ్ కలర్ ఇండికా.

• • •

ఆరూ ఇరవై నిముషాలకు సీవ్యూ ముందాగింది కారు. దిగి వెనుకడోర్ తెరిచి పట్టుకున్నాడు కిరీటి.

జేబులోవున్న సీవ్యూ తాళాలు కిరీటి చేతికందించి ''తాళం తీసి ఈ కిట్ లోపలపెట్టు'' అంటూ ఒక మెడికల్ కిట్ కిరీటికి అందించాడు భుజంగరావు.



కిట్ ఒకచేత్తో, తాళాలు మరోచేత్తో పట్టుకుని వెళ్ళి సీవ్యూ గేటు తెరిచి దాదాపు నలభై అడుగుల దూరంలో వున్న సీవ్యూ ముఖద్వారం వద్దకు నడిచాడు.

ఆవరణలో చుట్టూవున్న పలురకాల పూల మొక్కలకు పూచిన పూలు ఎంతో మనోహరంగా కన్పిస్తూ సముద్రంపైనుంచి వీచే చల్లగాలికి వూగుతూంటే అమాయకమైన ఆడపిల్లల మొహాలు అందులో కన్పించాయి కిరీటికి. ఆ పూవుల నుంచి వెదజల్లబడుతూన్న ఆహ్లాదకరమైన సుగంధ పరిమళాలు అతని మనసును అతి సున్నితంగా లాలిస్తూండగా ఈ పవిత్ర పరిసరాల మధ్య ఈ ఛండాలపు చర్యలా? ఛీ!!.. చీత్కరించుకుంది కిరీటి హృదయం.

అతను సీవ్యూ తాళంతీసి కిట్ లోపలపెట్టి వెనుదిరుగుతూండగా గుమ్మంలోంచి ప్రవేశిస్తూన్న యువతిని చూసి ఆశ్చర్యంతో అవాక్కయిపోయాడు!

ఆ యువతి వెంటే వచ్చిన భుజంగరావు కారు కీస్ కోసం చెయ్యి చాపాడు. చేతిలో వున్న కారు కీస్‌ని భుజంగరావు చేతిలోకి విసురుగా వదిలాడు కిరీటి. ఎంత సౌమ్యత ప్రదర్శిద్దామన్నా ఆ క్షణంలో అతని వల్ల కాలేదు!

భుజంగరావు అది గమనించనట్లుగా ''ఇక నువ్వెళ్ళొచ్చు'' అన్నాడు కిరీటికే విన్పించేంత నెమ్మదిగా. కిరీటి గుమ్మం దాటగానే సీవ్యూ తలుపులు చప్పున మూసుకున్నాయి. కడుపులో దేవినట్లై నోట్లో నీరూరగా పేవ్‌మెంట్ పక్కన తుపుక్కున వుమ్మేశాడు కిరీటి.

• • •


సీవ్యూ గేటుదాటి వచ్చేవరకూ 'డబ్బుకి మరీ యింత కక్కుర్తి పడే మనుషులుంటారా? అవును మరి– మనసే లేనపుడు ఇక మానంతో పనేమిటి?' అడుగడుక్కీ ఈ మాట అనుకుంటూనే వున్నాడు కిరీటి.

గేటుదాటి ఒక పాతికడుగులు వేశాక కాలికేదో తగిలినట్లయి చప్పున అవతలకు గెంతి కిందికి చూశాడు. కమ్ముకుంటూ బలాన్ని పుంజుకుంటూన్న లేత చీకట్లో అతనికి కాటర్‌వాల్, దాని పక్కనే కూసుగా వున్న రెండు గులకరాళ్ళు కన్పించాయి.

తేనెతుట్టెలా లుక లుక లాడుతూన్న కిరీటి మెదడులో ఒక బాల్యస్మృతి తేనెబిందువులా మెదిలింది. పన్నెండేళ్ళ వయసులో కిరీటికి 'కాటర్‌వాల్' ఒక ప్రియమైన ఆటవస్తువు. దాంతో తోటి కుర్రాళ్ళతో పందాలు కాసి ఎప్పుడు తనే నెగ్గేవాడు.

## తీరిన కోరిక

డాక్టర్ కాబోయే యాక్టర్నయ్యాను.. అని అంటారు సినీ హీరోలు. కానీ పోలీస్ ఆఫీసర్ని కావాలనుకుని సినీ నటుడిని అయ్యాను అని చెప్పాడు యువ హీరో పృథ్వీ



''మానాన్నగారు పోలీస్ అధికారి. నేను పోలీస్ ఉద్యోగంలో చేరి దేశసేవ చేయాలనుకున్నా. అనుకోకుండా నటుడ్ని అయ్యాను. కానీ ఆ కోరిక 'పాండు' చిత్రం ద్వారా నా డ్రీమ్‌రోల్ తీరబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది.'' అన్నాడు పృథ్వీ.

## ట్రాక్ మార్చిన అనుప్రియ

'నీతో చెప్పాలని' చిత్రంలో సెక్సీభామగా బోలెడంత క్రేజ్ సంపాదించుకున్న అందాల హీరోయిన్ అనుప్రియని ఆ తరువాత కనీసం కన్నెత్తి చూసిన నిర్మాతే కరువయ్యాడు.

'దంచినమ్మకు బొక్కిందే దక్కుడు' అన్నట్లు 'మంత్రశక్తి' అనే హారర్ చిత్రంలో హీరోయిన్‌గా నటించింది. ప్రేమకథ చిత్రాల హీరోయిన్‌గా గుర్తింపు పొందిన అనుప్రియకు హారర్ చిత్రాల హీరోయిన్ ఎంతవరకు రాణిస్తుందో ఈ చిత్రం రిలీజ్ అయినాక చూద్దాం.

- శ్వేత

నెగ్గినప్పుడల్లా స్నేహితులందరూ తనను హీరోను చేసి పొగుడుతూ భుజాలమీద ఎత్తేసుకుని జేజేలు పలుకుతూంటే కొండెక్కినంత సంబరంగా వుండేది.

'ఎవరో పల్లెకారు కుర్రాళ్ళు పడేసి పోయుంటారు' అనుకుంటూ కాటర్‌వాల్‌నూ, రాళ్ళనూ చేతిలోకి తీసుకున్నాడు. అటూ ఇటూ తిప్పిచూసి కాటర్‌వాల్‌లో ఒక రాయి అమర్చి రెండోదాన్ని జేబులో పడేసుకున్నాడు. గురికోసం చుట్టూ ఒకసారి కలియజూసి ఎదురుగా కొన్ని గజాల దూరంలోవున్న గానుకచెట్టు బోదె మధ్యలోవున్న బొర్రకేసి గురిపెట్టబోయి వెంటనే చేతులు దించేసాడు.

''ఆ చెట్టు తొర్రలో ఏ పిట్టతల్లయినా పిల్లలతో కాపరం పెట్టిందేమోనన్న డౌటొచ్చి మరేదైనా గురికోసం చూస్తూండగా ''హెల్ప్!.. హెల్ప్!.. నన్ను రక్షించండి'' అన్న ఆర్తనాదం సీవ్యూ వేపునుంచి అతని చెవులకు సోకింది.

కళ్ళు విప్పార్చి సీవ్యూకేసి తిరిగి చూశాడు కిరీటి.

సీవ్యూ కింది భాగానికి వున్న యిటువేపు కిటికీ సగం తెరుచుకుని వుంది. దాంట్లోంచే ఆ ఆర్తనాదం వినపడిందని గ్రహించి వెనుదిరిగి గేటు తెరుచుకుని కిటికీ వేపు వెళ్ళాడు కిరీటి.

''నేనలాంటిదాన్ని కాదండీ.. మీరు.. మీరు.. నా తండ్రిలాంటివారు. ఏదో డెలివరీ చేయాలి అంటే మీతో ఇటువచ్చాను.'' ఆమె ఏడుపులో దీనత్వం కిరీటిని కదిలించగా నొసలు చిట్లించి 'ఇదేంటో అయోమయంగా వుందేంటి చెప్మా' అనుకున్నాడు.

భుజంగరావు నవ్వు సన్నగా వికృతంగా ఎలుగ్గొడ్డు నవ్వులా ధ్వనించింది. ''వదిలేయటానికా నిన్నిన్నిసార్లు బతిమలాడి ఇంతదూరం పట్టుకొచ్చింది? నాచేతికొచ్చిన ఏ పిట్టా ప్రయోజనం అందించకుండా తప్పించుకుపోవటం కల్లోవార్త!..'' మళ్ళీ వికటంగా నవ్వు!

''వచ్చేనెలలో నాపెళ్ళి వుందండీ, నేను మీకూతుర్ననుకుని.. నన్ను వదిలేయండి. నా.. నా జీవితాన్ని కుక్కలు చింపిన విస్తరి.. చేయకండి.'' ఆమె రోదన ఎక్కువైంది. ఎక్కిళ్ళ మధ్య మాట్లాడలేక మాట్లాడుతోంది.

''హె.. గొడవపెట్టకాట్టే... నీ పెళ్ళికి నేనడ్డమొచ్చానా?.. నన్ను కట్టుకోమని నీకాళ్ళట్టుకున్నానా? ఈ ఒక్కపూటకి నీ అందాన్ని నాకు నైవేద్యం పెట్టు. డెలివరీకిస్తానన్న పాతికవేలకీ మరో పాతిక్కలిపి నీ కొంగుకి ముడేస్తా.

''వూహు.. మీరు లక్షలిచ్చినా నాకొద్దు. నన్ను వదిలెయ్యండి. హమ్మా!'' బాధగా అరిచిందామె. కిటికీ ఎదురుగా కాంపౌండువాల్ వారగావున్న సిమెంట్ బెంచీ ఎక్కి ఆందోళనగా లోపలికి చూశాడు కిరీటి.

డాక్టర్ సమీరను ఒడిసిపట్టి నలిపేయాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు భుజంగరావు. ఆమె ఒంటిమీద చీరలేదు. జాకెట్ వెన్నుపొడుగునా చిరిగిపోయి చీలికలై వేలాడుతోంది. మనిషి తోటకూర కాడలా వేలాడుతూనే శక్తినంతా వుపయోగించి పెనగులాడుతోంది. ఎరను వేటాడుతూన్న మృగంలా ఆమెను పట్టి విదిలిస్తున్నాడు భుజంగరావు.

''ఈ ఒక్కపూటకీ నాముచ్చట తీర్చావంటే రేపింటికెళ్ళి.. స్నానంచేసి.. శుద్ధి అయిపోతావుకదా. బెట్టు చేయక.. పదాగదిలోకి'' పళ్ళు బిగబట్టి అంటూ ఆమెను గదిలోకి లాక్కెళ్ళాలన్న ప్రయత్నంలో వున్నాడతను.

''భగవాన్! రక్షించు.. నన్ను రక్షించు.. ఆర్తిగా ఆక్రోశిస్తూ గింజుకుంటోంది సమీర.

ఆమె ఆక్రోశం కిరీటి గుండెలోతులకు దూసుకుపోయి సుళ్ళు తిరుగుతూ నోట్లోకి తన్నుకు వచ్చింది.

''భగవాన్! రక్షించు!'' కిరీటి నోటి నుండి అప్రయత్నంగా అభ్యర్థన వెలువడింది. ఒంట్లో వున్న శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకుని కాటర్‌వాల్‌ని కిటికీవేపు సూటిగా గురిపెట్టాడు.

రెండు క్షణాల్లో పెనగులాటలో భుజంగరావు తల కిటికీవేపుకు రాగానే కాటర్‌వాల్లోని కూసురాయి సర్రున గాల్లో దూసుకుపోయి ఆ తలకింద మెడభాగంపై గట్టిగా తగిలి వీపు మీదుగా కిందకు జారిపోయి టప్పున ఫ్లోరింగ్ మీద పడింది. అది పడీపడగానే బాధాపూరితమైన హాహాకారం చేస్తూ ఏనుగు కూలినట్లు కూలిపోయాడు భుజంగరావు.

వెంటనే కాటర్‌వాల్ ప్రహరీ అవతలికి విసిరేసి అచేతనుడై ఆ బెంచీమీద కొన్ని నిముషాలు కొయ్యబొమ్మలా అలాగే నిలబడిపోయాడు కిరీటి.


తలమీదుగా 'కికీ..కికీ' అని అరుస్తూ ఎగిరివెళ్ళిన తీతువుపిట్ట అరుపుతో ఉలిక్కిపడి చైతన్యంలోకి వచ్చాడు. తెలివిలోకి రాగానే చప్పున సిమెంట్ బెంచీ దిగి కిటికీ దగ్గరకు పరుగెత్తాడు. నేలకు పదడుగుల దూరంలోవున్న ఆ కిటికీ దగ్గరికి చేరుకోవటానికైనా దారికోసం చుట్టూ కలియజూశాడు. రెండడుగులు అవతలగా నీళ్ళగొట్టం భగవానుడు కూర్చిన దారిలా అగుపించింది.

ఇక క్షణం కూడా ఆలస్యం చేయలేదు కిరీటి.

ఆ గొట్టం పట్టుకుని అతి ప్రయత్నమ్మీద పాకుతూ పది నిముషాల్లో కిటికీ లెవెల్‌కి చేరుకున్నాడు. ఎడమచేత్తో గొట్టం పట్టుకుని కుడిచేత్తో కిటికీ తలుపు అంచును అందుకుని ఒక కాలును గోడకు అణచిపెట్టి వేలాడుతూ కిటికీగుండా లోపలికి చూశాడు.

వేటగాడి దెబ్బతిన్న ఎలుగుబంటిలా నేలమీద పడివున్నాడు భుజంగరావు. అర్థనగ్నంగా వున్న సమీర గోడకతుక్కుపోయి శిలాప్రతిమలా నిలబడి గుడ్లేసుకుని కిటికీకేసి చూస్తోంది!

''ఇదుగో, మిమ్మల్నే..'' వీలైనంత గట్టిగా అరి



చాడు కిరీటి.

అతని అరుపు వినగానే ఉలిక్కిపడి స్పృహలోకొచ్చి ఛాతీమీద చప్పున చేతులు కప్పేసుకుని వెనక్కు తిరిగింది సమీర.

''ఆయనగారి జేబులో తాళాలుంటాయి. వాటిని తీసుకుని తలుపు తెరవండి త్వరగా.'' అరిచి చెప్పాడు కిరీటి ఆరాటం, ఆందోళన మిళితమైన కంఠంతో.

కుడిచేతిని మళ్ళీ గొట్టంమీదికి తేబోతూండగా భుజంలో కలుక్కుమని చాలా బాధనిపించగా 'అబ్బా' అని మూలిగి అంతలోనే తమాయించుకుని జర జర కిందికి జారి ద్వారంవేపు పరుగులాంటి నడకతో వెళ్ళాడు. పది నిముషాలు వూపిరి బిగపట్టి వేచి చూశాక అప్పుడు తలుపు తెరిచింది సమీర.

అస్తవ్యస్తంగా ఒంటిచుట్టూ చుట్టుకున్న చీరలో శోకదేవతలా వున్న ఆమె కిరీటికి రెండుచేతులూ జోడించి దణ్ణం పెట్టింది.

అతని కళ్ళలో కొట్టొచ్చినట్లు, కనిపించిన తీవ్రమైన తిరస్కారం గమనించి ఆమె మనసులో మూడు నెలల క్రితం జరిగిన ఒక సంఘటన లీలగా మెదిలింది.

''భగవాన్!'' నీరసంగా కళ్ళు మూసుకుని తల పట్టుకుంది.

ఆమెను తప్పించుకుని లోపలికెళ్ళిన కిరీటి శవంలా పడివున్న భుజంగరావు పక్కన కూర్చుని ముక్కుదగ్గర వేలుపెట్టి చూశాడు. భుజంగరావులో వూపిరి వుండటం గమనించి లేచినిల్చుని సమీరకేసి చూసి, ''మీరాకిట్ పట్టుకుని వెళ్ళి ఫ్రంట్ సీట్లో కూర్చోండి. తాళాలిక్కడ పెట్టి వెళ్ళండి'' అన్నాడు.

కదలక మెదలక నిలబడి తనకేసే చూస్తున్న ఆమెను ''చెప్పేది మీకే. ఆయన్ను త్వరగా హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి. పదండి'' అన్నాడు ఆజ్ఞాపించినట్లు.

సమీర కిట్ పట్టుకుని ఆదరాబాదరా బయటకు నడిచింది. స్పృహలేని భుజంగరావు శరీరాన్ని ఒడుపుగా ఎత్తి భుజాన పెట్టుకున్నాడు కిరీటి.

బరువుగా అడుగులేస్తూ కారు దగ్గరకు నడిచాడు.

భుజంగరావుని జాగ్రత్తగా వెనకసీట్లో పడుకోబెట్టి డోర్‌వేసి వెనక్కు తిరిగేప్పటికి కిట్ పట్టుకుని ప్రతిమలా నిలబడివున్న సమీర కన్పించింది.

విసుగ్గా నొసలు చిట్లించాడు కిరీటి.

''ఫ్రంట్ సీట్లో కూర్చోమని చెప్పాగదా. వెళ్ళి కూర్చోండి'' విసురుగా అన్నాడామెతో.

బిక్కు బిక్కుమంటూ ఫ్రంట్ డోర్‌వేపు నడిచింది సమీర. కిరీటి తిరిగి నీవ్యూకెళ్ళి లోపలి లైట్లు ఆర్పేసి తలుపుకి తాళంపెట్టి వచ్చి డ్రైవింగ్ సీట్లో కూర్చుని స్టీరింగ్ వీల్ పట్టుకున్నాడు. కొన్ని క్షణాలలో కారు శరవేగంతో టౌన్‌వేపు దూసుకుపోయింది.

కిరీటి పక్కనే కూర్చున్న సమీర మనసు అంతర్మథనంతో అల్లకల్లోలమైపోతూండగా రెండు మూడుసార్లు అతన్ని పలకరించి మాట్లాడదామని ప్రయత్నం చేసింది కానీ సాధ్యం కాలేదు.

పావుగంటలో కారు బ్రేక్‌వేసి ఆపాడు కిరీటి. ''దిగండి'' అన్నాడు డాక్టర్ సమీరతో.

వులిక్కిపడిన సమీర ''మీ.. మీ.. చెల్లెలు..'' అంటూ ఏదో అనబోయింది. కారంతా చీకటిగా లేకపోయినట్లయితే అతని ముఖంలో ద్యోతకమయిన విషాదం ఆమె గుండెల్ని పిండేసి వుండేది.

చిన్నగా దగ్గి గొంతు సవరించుకుని ''అందరి సంగతీ మీకనవసరం. ఇక ముందెప్పుడూ కక్కుర్తికి పాల్పడి ఇలాంటి సంఘటనలు జరక్కుండా మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకోండి'' అన్నాడు నిర్లిప్తంగా.

''నేను.. నేను..'' సమీర మాటల్ని చేత్తో వారిస్తూ ''ప్లీజ్! దిగిపోండి'' అన్నాడు.

డోర్ తెరిచి కిట్ పట్టుకుని మౌనంగా కారు దిగేసింది సమీర.

ఆమె దిగిన మరుక్షణం కారు సాగిపోయింది.

కారు కనుమరుగైపోయేంతవరకూ చూసి భారంగా నిట్టూర్చి దగ్గరున్న గూర్ఖాను కేకేసింది.

• • •

మర్నాడు వుదయం 'వివేకానంద హాస్పిటల్' ఆవరణలో కారాపి దిగింది డాక్టర్ సమీర.

తన ఫ్రెండు సుకన్య చెప్పిన ఇన్ఫర్మేషన్ ప్రకారం లిఫ్ట్ ఎక్కి రూమ్ నెంబర్ 219 వేపుకు నడిచింది. 219 రూమ్‌కి కాస్త ఇవతలగా నిల్చుని ఎవరితోనో చెప్తున్నాడు కిరీటి.

''ఎప్పటిలాగే అయ్యగార్ని వీకెండ్ సీవ్యూ షైర్‌కి తీసుకెళ్ళానండీ.. ఆయన చల్లగాలిలో అలా అలా పచార్లు చేస్తూంటే నేను ఆయన వెనకే నడుస్తున్నాను. ఇంతలో అయ్యగారు విరుచుకు పడిపోయారండీ ఆ ఇసుకలో. నాకేమీ అర్థంకాక ఏమిటా? అని చుట్టూ చూస్తే కొంతమంది పల్లెకార్ల పిల్లలు కాబోలు చేతుల్లో కాటర్‌వాల్స్‌తో కన్పించారు. జరిగిందేమిటో అర్థమయింది నాకు. వెంటనే అయ్యగార్ని కార్లో ఇక్కడకు తీసుకొచ్చేశాను. ఇంకానయం, సమయానికి ఇక్కడకు చేరుకోబట్టి అయ్యగారు సేవ్ అయ్యారు.''

కిరీటి మాటలు వింటున్న ఆయన ''నిజమే. భగవానుడాయన్ని రక్షించాడు'' అన్నాడు రెండు చేతులూ జోడించి దైవానికి నమస్కరిస్తూ.

అక్కడ నిల్చున్న సమీరను అప్పుడే గమనించిన కిరీటి ఆమెకేసి ఓరగా చూస్తూ ''అవును. భగవానుడు రక్షించాడు!'' అన్నాడు మెల్లగా.

కళ్ళతోనే అతనికి అభివాదం చేసి మౌనంగా వెనుదిరిగి వెళ్ళిపోయింది డా. సమీర.

★

## వడియాలు

''మీకు శ్రమ లేకుండా మీ కోడలు వడియాలు పెడుతుంటే అలా కోపంతో ఆ అమ్మాయిపై ఒంటికాలిమీద లేస్తావెందుకు?'' అంది పక్కింటి పార్వతమ్మ.

''ఆమె వడియాలు పెట్టేది నా పెళ్ళినాటి పట్టుచీరమీద'' చెప్పింది జయమ్మ.

## ప్రేమలేఖ

''నాకు వ్రాసిన ప్రేమలేఖ నేరుగా నా చేతికే ఇవ్వవచ్చుగా! మధ్యలో మా చెల్లెలుకి ఇస్తావెందుకు?'' అడిగింది కోమలి.

''నీకు ఇష్టం లేకపోతే నీ చెల్లెలు ప్రేమిస్తుందని?'' చెప్పాడు మురళి.

## పార్క్

''నువ్వు ప్రేమించిన అమ్మాయితో కలిసి పార్కుకు వెళ్లావటగా. నిన్నంతా ఏం చేసారేంటి?'' అడిగాడు అనంత్.

''ఏం చేయలేదు. ఇద్దరం కలిసి పచ్చగడ్డి పీకాం'' అన్నాడు సుమంత్.

## పాత్ర

''సినిమాల్లోనూ, చివరకు టీవీ సీరియల్స్ లోనూ నీకేపాత్ర దొరకలేదన్నావు. ఇప్పుడేం చేస్తున్నావు?'' అడిగింది మీనాక్షి.

''బ్యూటీక్లినిక్ నడుపుతున్నాను'' చెప్పింది కామాక్షి.

## షాపింగ్

''మీరు బరువు తగ్గాలంటే బాగా వాకింగ్ చేయాలమ్మా'' అన్నాడు డాక్టర్.

''అయితే ఎక్కువగా షాపింగ్ చేస్తే సరిపోతుందిగా!'' అడిగింది కావేరి.

-వెలవల సాంబశివరావు (గుంటూరు)

